# ఇంటర్వ్యూ

సి. జయాబాలకృష్ణ

రమేష్ బస్సుదిగి హడావిడిగా ఆఫీసుకి వచ్చి కూర్చున్నాడు.

ఉదయం పది గంటలు అయి వుంటుంది షుమారుగా. ఆఫీసు వరండాలో– యింకా చాలా మంది కూర్చుని వున్నారు. ఇద్దరు, ముగ్గురు అమ్మాయిలూ, ఓ పాతిక మందిపైగా అబ్బాయిలూ– అందరూ అక్కడ వున్న బెంచీల, కుర్చీల మీద సర్దుకుని కూర్చున్నారు.

జేబులో వున్న రుమాలు తీసుకొని, ముఖం తుడుచుకున్నాడు రమేష్. అక్కడ కూర్చున్న వాళ్లు కూడా– ఏదో ఆదుర్దా, భయం, ఆశ, తొందర– యింకా యిలాంటి భావాలన్నీ కలిసిపోయి, తలొకరూ తలొక రకమైన ఆలోచనలలో వున్నారు.

"టైము ఎంత అయిందండీ?" ప్రక్కనే కూర్చుని వున్న అమ్మాయిని అడిగాడు.

"పదీ... అయిదు" అన్నది ఆ అమ్మాయి చేతికున్న గడియారంచూసుకుంటూ.

"ఇంటర్వ్యూ మొదలైందా మేడమ్?" అడిగాడు మర్యాదగానే.

"ఇంకా లేదండీ!" అన్నది ఆ అమ్మాయి.

"హమ్మయ్య! పరవాలేదు. చాలా కంగారు పడిపోతూ వచ్చానండీ. ఈ జంట నగరాల్లోని వైభవోపేతమైన ఆర్.టి.సి. బస్సులు–పాపం నా మీద జాలిపడి కాబోలు– కనీసం యీ టైముకైనా ఆ బస్సు నన్ను ఇక్కడికి చేర్చింది" అన్నాడు.

చిరునవ్వు నవ్వింది ఆ అమ్మాయి.

"ఎక్కడి నుంచి వస్తున్నారు? అడిగింది.

"శ్రీనగర్ కాలనీ అని– చాలా గొప్ప కాలనీ లెండి"

నవ్వింది.

"ఉదయం ఏడున్నరకి బస్‌స్టాండ్‌లో నిలబడ్డానండి. ఇదిగో యిప్పటికి యిక్కడ తేలాను. నాకైతే యివ్వాళ యీ యింటర్ వ్యూకి టైముకి అందుకుంటానని ఆశలేకపోయింది" అన్నాడు కాస్త తేలిగ్గా ఊపిరి పీలుస్తూ.

రమేష్ మాటలకు ఆ అమ్మాయి నవ్వుతూ కూర్చొంది.

"ఏం చదివారు?" అడిగింది.

"ఎందుకు అడుగుతారు లెండి బొత్తిగా అన్యాయం"

"అంటే"

"ఏముంది? బి.ఏ. డబుల్ మాథ్స్"

ఇద్దరి మధ్య ఏవో కబుర్లు దొర్లినాయి.

మరొక పావుగంట తరువాత– ఒకరి తరువాత మరొకరిని లోపలికి పిలుస్తున్నారు ఇంటర్వ్యూ చెయ్యటానికి.

యింటర్వ్యూ అయిన వాళ్లు వెళ్ళిపోతున్నారు.

రమేష్‌ను పిలిచారు.

ఫైలు పుచ్చుకుని లోపలికి వెళ్లాడు

గుమ్మం ఎదురుగా రెండు కుర్చీల్లో యిద్దరు కూర్చుని వున్నారు. అందులో ఒకాయన్ని చూసేసరికి రమేష్‌కు గుండె ఆగిపోయినట్లైంది. కరెంట్ షాక్ కొట్టినట్టుగా –కెవ్వున అరవబోయి మానుకున్నాడు.

ఆయన ఫుల్ సూటులో వున్నాడు. చాలా హుందాగా, గంభీరంగా వున్నాడు. రమేష్‌ని చాలా నిదానంగా, సీరియస్‌గా చూస్తున్నాడు. మరుక్షణంలో గుర్తు పట్టినట్టుగా చూశాడు.

ఆయన చూపులకి– రమేష్‌కి భయం వేసింది. 'కౌశికుడు కొంగని చాలా కోపంగా చూశాడుట– ఆయన చూపులకి ఆ కొంగ మాడిపోయి, చచ్చిపోయిందిట.' పురాణ కథ గుర్తు వచ్చింది. 'ఈయన చూపులు కూడా–ఆ కౌశికుడిలా... అలా... అలా...'

భయం, భయంగా నిలబడ్డాడు.



"కూర్చోవోయ్" మరొక ఆయన అన్నాడు.

"థ్యాంక్యూ సర్" కూర్చున్నాడు.

"బి.ఏ. చదివావా?" కౌశికుడు అడిగాడు. రమేష్ దృష్టిలో ఆయన కౌశికుడే.

"అవును సార్' వినయంగా అన్నాడు. మనసులో భయం, నిరాశ...

"ఊ..." అన్నాడు కౌశికుడు.

'ఏమిటి సర్?' అన్నట్టుగా చూశాడు రమేష్.

"ఏమోయ్ రమేష్?" కౌశికుడు అన్నాడు.

"సార్!"

"నీకు రూల్సూ, రెగ్యులేషన్సూ... పద్ధతులూ చాలా తెలుసుననుకుంటాను."

"అదికాదు సర్..., సారీ సర్..." ఏదో చెప్పాలని ప్రయత్నించాడు రమేష్. అతని మాటల్లో అభ్యర్థన ధ్వనించింది.

"అవన్నీ చాలా స్ట్రిక్ట్‌గా ఫాలో అవుతావనుకుంటాను."

కౌశికుడి మాటల్లో వ్యంగ్యం ధ్వనించింది అని పించింది రమేష్‌కి.

"మనిషి అవసరం కంటె– నీకు యీ రూల్స్, పద్ధతులూ చాలా ముఖ్యం... కదూ!"

'సారీ సర్!... అదికాదు సర్... పొరపాటే సర్...' అనబోయి,

"సారీ సర్... కాస్త ముఖ్యమే" అన్నాడు.

'తనకి ఎలాగూ యీ ఉద్యోగం రాదని ఖచ్చితంగా తెలుస్తూనే వుంది' అనిపించింది రమేష్‌కి.

"ఇంక నువ్వు వెళ్లచ్చు" అన్నాడు ఆఫీసర్.

ఆ గదిలో నుంచి బయటికి వచ్చి, కాస్త తేలిగ్గా వూపిరి పీల్చుకుని, ఆ అమ్మాయి దగ్గరికి వచ్చి కూర్చున్నాడు.

"ఏమడిగారు రమేష్ గారూ?" అడిగింది ఆ అమ్మాయి.

"ఏం?"

"అదో పెద్ద కథ!" తమాషాగా అన్నాడు.

"ఏమిటి?"

నాలుగు రోజుల క్రితం జరిగిన సంఘటన గుర్తు వచ్చింది రమేష్‌కి... .... ....

xx xx xx xx

తెల్లవారు ఝామున నాలుగింటికి అలారం మ్రోగింది. చలి వొణికిస్తున్నా లేవక తప్పలేదు రమేష్‌కీ, రమేష్ తమ్ముడు గోపీకీ.

మధ్య తరగతి కుటుంబంలో– రిటైరైన తండ్రి పెన్షన్ చాలక, నిరుద్యోగిగా వుండటం యిష్టంలేక, రమేష్ పాలబూత్‌లో పాల ప్యాకెట్లు యివ్వటం– దాని మూలంగా నాలుగు రూపాయల సంపాదన– అక్కడి నుంచి గోపీ పేపర్లు యివ్వటంతో –వాళ్ళకి ప్రతి ఉదయం మొదలవుతుంది.

పాల ప్యాకెట్లు అన్నీ బూతులో వుంచి– అందరికీ కార్డు మీద, డబ్బులకీ, యివ్వడం మొదలు పెట్టాడు రమేష్.

ఆ రోజు పాల వ్యాను ఆలస్యంగా రావటంతో– జనం బాగా వున్నారు. "క్యూలో రండి, లేకపోతే పాలు యివ్వను." ఖచ్చితంగా చెప్పాడు రమేష్. గోపి జనాన్ని క్యూలో నిలబడమని సర్దుతున్నాడు.

ఓ నలభై ఏళ్లు దాటిన ఒకాయన తెల్లని నిక్కరు, తెల్లటి 'టీ' షర్టు వాకింగ్ కోసమని కాబోలు వేసుకున్న– హడావిడిలో 'క్యూ'ని దాటి ముందరకి వచ్చి, కార్డు చూపించాడు.

రమేష్ ఆశ్చర్యంగా చూశాడు ఆయన వంక.

"అలా చూస్తావేమిటోయ్!నీ దొక ఆలస్యమా? ఇవ్వు త్వరగా!" ఆయన కాస్త జబర్దస్తీగా అన్నాడు.

"ఇవ్వను..." క్యూలో నిలబడిన వాళ్లకి యిస్తూ ఖచ్చితంగా చెప్పాడు.

"ఏం? ఎందుకని?" కోపం వచ్చింది ఆయనకి

"క్యూలో రండి. ఇక్కడ వున్న వాళ్లంతా మీ కంటె ముందర వచ్చి, క్యూలో నిలబడ్డారు."

"క్యూ ఏమిటోయ్!.... నేను త్వరగా వెళ్లాలి యివ్వు. అసలు యివ్వాళ మా పనివాడు లేడు. అందుకని నేను రావాల్సి వచ్చింది." చిరాకు పడి పోతున్నాడు ఆయన.

"రమేష్... యివ్వు ఆయన ఎవరనుకుంటున్నావు? యివ్వు పరవాలేదు" క్యూలో నిలబడ్డ ఒకాయన అన్నాడు.

"ఎవరైనా కానీయండి అంకుల్! రూలు రూలే. క్యూలో నిలబడాలి..., తీసుకోవాలి. నా పద్ధతి అంతే. సారీ!" ఖచ్చితంగా చెప్పాడు. మిగతా వాళ్లకి పాల ప్యాకెట్లు యిస్తూ–

చేసేదిలేక, క్యూలో నిలబడి, అరగంట ఆలస్యంగా పాల ప్యాకెట్లు తీసుకొని వెళ్లిపోయాడు ఆయన.

నాలుగు రోజుల క్రితం జరిగిన సంఘటన!– ఇదిగో... యివ్వాడు యీ యింటర్‌వ్యూలో– ఆయన కౌశికుడి రూపంలో... ... తనని శపించినట్లు చూశాడు. యింక తనకి యీ వుద్యోగం రాదంటే– రాదు...! జరిగిన సంగతి చెప్పాడు.

"అయ్యో! అయితే మీకు యీ వుద్యోగం రాదేమో...!" అన్నది ఆ అమ్మాయి రమేష్ చెప్పిన దంతా విని–

"రాదేమో ఏమిటి! రాదంటే రాదు. మీరు జాగ్రత్తగా యింటర్ వ్యూ చెయ్యండి. అదృష్టం వుంటే– మీకు వస్తుందేమో..." అని "మరి వస్తాను. ఆల్ ది బెస్ట్!" అని వచ్చేశాడు–

xx xx xx xx xx

పది రోజుల తరువాత– పోస్టులో వచ్చిన అప్పాయింటుమెంట్ ఆర్డరు చూసుకుని– నమ్మలేని నిజాన్ని, పట్టరాని ఆనందాన్ని భరించలేక తలక్రిందులైపోయాడు రమేష్!

ఆఫీసులో చేరిన రోజున –ఆఫీసర్ కౌశికుడు పిలిచి– "నువ్వు నాకు నచ్చావోయ్! అందుకే నిన్ను సెలెక్ట్ చేశాను. కీపిట్ అప్" అన్నాడు.

'ఆహా!... తన సిద్ధాంతాలకీ, తన పద్ధతులకీ... ప్రాణం వుందన్నమాట...'

రమేష్ ఆనందంగా గాలిలో తేలిపోతూ– తన టేబుల్ దగ్గరకి వచ్చి కూర్చున్నాడు.

"కంగ్రాట్సు!... మీరూ వచ్చారే!" అంది పక్క టేబుల్ ముందు కూర్చున్న ఆ అమ్మాయి నవ్వుతూ! ●




